జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 8-1-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 213 పేజీలు: 4 వెల: రూ.7

# మౌనమేలనోయి..!



* వైరాగ్యంలో.. వైసీపీ నేతలు * నాడు చక్రం తిప్పిన నేతలు.. నేడు సైలంటయ్యారు * పార్టీ కార్యక్రమాలకు దూరంగా కొందరు మాజీలు * జిల్లా కేంద్రంలో పార్టీకి నీడ కరువు * వారసత్వ రాజకీయాలకు గుడ్‌బై చెప్పనున్న అధిష్టానం * తమ్మినేని, ధర్మాన వారసులకు నోచాన్స్ అంటూ గాసిప్పులు * సీనియర్లకు సైతం అవకాశాలు లేనట్టే * కొత్త నాయకత్వం వైపు పార్టీ దృష్టి * పక్కచూపులు చూస్తున్న కొందరు సీనియర్లు

**శ్రీకాకుళం, జనవరి 7 (వార్త):** మొన్నటి వరకూ వైభోగం అనుభవించిన వైసీపీ నాయకులు ప్రస్తుతం వైరాగ్యంలో ఉన్నారు. సిక్కోలు జిల్లాలో కీలకమైన వైసీపీ నాయకులు ఇప్పుడు సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. 2019-2024 మధ్య కాలంలో తమ పార్టీ అధికారంలో ఉన్నపుడు ఈ నేతలు వివిధ హోదాల్లోనుంటూ నిత్యం హడావిడి చేసేవారు. అప్పట్లో చక్రం తిప్పిన నేతలందరూ ఇప్పుడు ఎక్కడివారక్కడే చల్లబడిపోయారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు గెలవలేకపోయిన వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యక్రమాలకు సైతం దూరమయ్యారు. వైసీపీ అధినేత జగన్ జన్మదినోత్సవాన్ని ఒకటి, రెండుచోట్ల తూతూ మంత్రంగా జరిపారు. ఎన్నికల హామీలను అమలుచేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ఇందుకుగానూ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వైసీపీ అధినాయకత్వం పిలుపునిచ్చినా, జిల్లాలో నేతల స్పందన నామమాత్రంగానే ఉంది. గతంలో మంత్రి పదవులు నిర్వహించిన ధర్మాన సోదరులు, సీదిరి అప్పలరాజు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంతో పాటు మాజీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలను అంతగా పట్టించుకోవడంలేదు. సమీప భవిష్యత్‌లో ఎలాంటి ఎన్నికలు లేనందున పార్టీలో ప్రస్తుతం స్తబ్ధత నెలకొందని వైసీపీ నేతలంటున్నారు. ఐదేళ్లు దర్జాగా అధికారం అనుభవించిన జగనన్న తమ్ముళ్లు కూటమి ప్రభుత్వం వచ్చాక దిక్కుతోచక దిగాలుపడ్డారు. దీంతో పార్టీ కేడర్‌కు వైసీపీ నేతల దర్శనమే కరవైంది.

ఇటీవలే శ్రీకాకుళంలోని వైసీపీ జిల్లా కార్యాలయాన్ని ఎత్తేశాక ఆ పార్టీ శ్రేణులకు మరింత నీరసం ఆవహించింది. కోర్టు కేసు కారణంగా నిర్మాణ దశలో ఉన్న జిల్లా పార్టీ భవనం పనులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు సమావేశమయ్యేందుకు నీడ కరవైంది. జిల్లా కేంద్రంలో పార్టీ లేకపోవడం ఒకందుకు మంచిదేనని సీనియర్ నేతలు లోలోపల సంబరపడుతున్నారు. ఎన్నికల్లో ఓటమి కారణంగా నీరసపడిన 'మాజీ'లు ఇప్పుడు మరింత సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ సహా ఇతర పెద్దలు జిల్లావ్యాప్తంగా పర్యటించేందుకు, పార్టీని బలోపేతం చేసేందుకు ఉత్సాహం చూపడంలేదు. తమ రాజకీయ జీవితం ముగింపు దశలో ఓటమి చెందడాన్ని కొందరు వైసీపీ ముఖ్య నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. తమ వారసులకు టికెట్లు ఇప్పించుకుని, వారిని ఎన్నికల్లో గెలిపించుకోవాలని తెగ ఆరాటపడిన 'మాజీ'లకు భంగపాటు తప్పలేదు. కొంతమంది సీనియర్ నేతలకు ఇక రిటైర్‌మెంటు తప్పదని, వారి పుత్రరత్నాలకు బదులు కొత్తవారికి అవకాశమిస్తేనే పార్టీకి మనుగడ ఉంటుందని వైసీపీ కార్యకర్తలు అంటున్నారు. పార్టీలో కొన్ని కుటుంబాలదే ఆధిపత్యం అవుతున్నందున ఇకనైనా వారసత్వ రాజకీయాలకు స్వస్తి చెప్పాలని వైసీపీ కేడర్ భావిస్తోంది.

### మాజీలు పక్కచూపు..

కాగా, ప్రస్తుత పరిస్థితుల్లో చాలామంది వైసీపీ నేతలు మౌనం వహించగా, మరికొందరు పార్టీ మారేందుకు పక్క చూపులు చూస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. తెలుగుదేశంలోకి తమకు ఎంట్రీ కష్టమని భావిస్తున్న కొందరు కీలక వైసీపీ నాయకులు బీజేపీ.. జనసేనలో చేరితే ఎలా ఉంటుందని లెక్కలు వేసుకుంటున్నారట. తమ వారసులకు అవకాశమిస్తే ఇతర పార్టీల్లోకి వెళ్లేందుకు కొందరు 'మాజీ'లు ప్రయత్నాలు ప్రారంభించారట. ఈ నేపథ్యంలోనే ఉత్తరాంధ్రకు చెందిన వైసీపీ కీలక నేత సిక్కోలు జిల్లాలో ఇటీవల ఒకరిద్దరు సీనియర్‌లను కలిసి, పార్టీని వీడవద్దని సముదాయించారట. ఎన్నికలకు సమయం చాలా దూరంగా ఉండడంతో సీనియర్లు సైతం వేచిచూసే ధోరణిలో ఉన్నారు.

### ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో..
# అంతర్ రాష్ట్ర సంయుక్త దాడులు

* 16,600 లీటర్ల నాటుసారా నిల్వలు ధ్వంసం



**మందస, జనవరి 7(వార్త):** ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో జరుగుతున్న నాటుసారా తయారీ, అమ్మకాలపై ఆంధ్రా, ఒడిశా అధికారులు భారీగా దాడులు నిర్వహించారు. మందస మండలంలోని ఎగువ ప్రాంతంలో గల మహేంద్రగిరులకు ఆనించి ఉన్న ఒడిశా ప్రాంతాల్లో డీపీఈఓ, ఏఈఎస్, ఎన్‌ఫోర్స్మెంట్ పర్యవేక్షణలో సంయుక్తదాడులు చేశారు. శ్రీకాకుళం ఎన్‌ఫోర్సుమెంట్, ఇచ్ఛాపురం, పాతపట్నం, సోంపేట, పలాస ఎక్సైజ్ అధికారులతో పాటు ఒడిశాకు చెందిన ఎక్సైజ్ అధికారులు, పోలీసులు, ఆర్మ్ రిజర్వు పోలీసులు సుమారు 100 మంది ఏకకాలంలో దాడులు చేశారు. ఒడిశా రాష్ట్రంలోని గంజాం జిల్లాలోని పొట్కాసింగు గ్రామంలో 5600 లీటర్ల ఎఫ్‌జె వాష్, బడజోలాలో 3000 లీటర్లు, గొంగాపూర్‌లో 8000 లీటర్ల వాష్ ధ్వంసం చేశారు. 83 ప్లాస్టిక్ డ్రమ్ములను గుర్తించి, ఒక్కో డ్రమ్ములో నిలువ ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటలు కూడా ధ్వంసం చేశారు. ఒకేసారి పెద్ద ఎత్తున దాడులు చేసి, నాటుసారా ధ్వంసం చేయడంతో తయారీదారులు ఎవరన్న దానిపై ఆరా తీశారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

**శ్రీకాకుళం క్రైం, జనవరి 7 (వార్త):** నగరంలోని న్యూకాలనీ పార్క్ సమీపంలో జూదమాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి తొమ్మిది వేలు స్వాధీనం చేసుకున్నామని రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు. అలాగే గంజాయి కేసుకు సంబంధించి పరారీలో ఉన్న నిందితుడిని ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాకుళం నగరంలోని పెద్దరెల్లి వీధికి చెందిన ఓ బాలుడు గతేడాది సెప్టెంబరులో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో తొమ్మిది మందిని అరెస్టు చేయగా ముగ్గురు పరారీలో ఉన్నారు. ఒకటో పట్టణ పోలీసులకు మంగళవారం బాలుడు చిక్కాడు. అదుపులోకి తీసుకున్న బాలుడిని కోర్టుకు తరలించామని ఎస్సై హరికృష్ణ తెలిపారు.

### వివాహిత ఆత్మహత్య

గార మండలం బందరువానిపేట గ్రామానికి చెందిన కోనాడ బోడెమ్మ (55) అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. మంగళవారం ఆమె తలకు రాసుకునే ద్రావణాన్ని తాగేసి అపస్మారక స్థితికి చేరుకుంది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కుమారుడు సందయ్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని గార ఏఎస్సై మూకళ్ల చిరంజీవరావు తెలిపారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఎస్సీల గణనపై 12 వరకు అభ్యంతరాల స్వీకరణ

**శ్రీకాకుళం, జనవరి 7(వార్త):** ఎస్సీల గణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును ఈనెల 12వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తెలిపారు. ఈనెల 7వ తేదీతో గడువు ముగియగా, మరో 5 రోజులు పొడిగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్వోపీ విధివిధానాలు తెలుపుతూ ప్రభుత్వం 265 నంబరు జీవో విడుదల చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఈ నెల 12వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. స్వీకరించిన వివరాలను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ఈ నెల 16 వరకు అధికారులు నమోదు చేస్తారన్నారు.

అనంతరం అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను ఈ నెల 20న గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తామని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు.

# మోదీ సభను విజయవంతం చేద్దాం

**-ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్**
**-బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన**

**రాజాం, జనవరి 7(వార్త):** విశాఖలోని ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జరగనున్న ప్రధాని మోదీ భారీ బహిరంగ సభ ఏర్పాట్లను కూటమి నాయకులతో కలిసి రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత ప్రధాని మోదీ మొదటిసారిగా రాష్ట్రానికి వస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మూడు పార్టీల నేతలతో కలిసి సమన్వయంగా సమీక్షా సమావేశం నిర్వహించి ఈ సభకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక రీతిలో సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతగా భారీ బహిరంగ సభ విజయవంతమయ్యేందుకు నేతలతో కలిసి కృషి చేస్తున్నామన్నారు. ఈ భారీ బహిరంగ సభకు మూడు లక్షల మంది వరకు ప్రజానీకం హాజరవుతారని తెలిపారు. రాజాం నుంచి కూటమి శ్రేణులు తరలిరావాలని ఆయన కోరారు.



# క్షతగాత్ర వృద్ధురాళ్లకు 'అభయం'



**టెక్కలి, జనవరి 7(వార్త):** రక్తం దొరక్క టెక్కలిలోని సామాజిక ఆసుపత్రిలో బాధపడుతున్న ఇద్దరు వృద్ధులను అభయం సేవా సంఘం సభ్యులు ఆదుకున్నారు. వీరికి రక్తదానం చేసి, వారి ప్రాణాలను నిలబెట్టారు.

సుంకాన నరసమ్మ, జి.భారతమ్మ అనే వృద్ధులు ప్రమాదవశాత్తూ వారి ఇంటిలో పడి పోయాయి. దీంతో ఒకరికి కాలు, ఇం కొకరికి చేయి విరిగిపోయాయి. వీరికి శస్త్రచికిత్స నిమిత్తం వైద్యులు రక్తం అవసరమని కుటుంబసభ్యులకు తెలి యజేశారు. కానీ రక్తదానానికి బంధు వులు ఎవరూ అందుబాటులో లేకపోవ డంతో బాధిత కుటుంబసభ్యులు టెక్కలి అభయం యువజన సేవా సంఘం వారిని కలిశారు. దీంతో వారు స్పం దించి బ్లడ్ బ్యాంక్ వారితో మాట్లాడి రక్తాన్ని అందించారు.

ఈ సందర్భంగా అభయం సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు, ట్రెజరర్ శ్రీని వాస్ బెహరా, సంఘ సభ్యులు జె.ఆది నారాయణ, జె.శనిభూషణ్, ఎం.దుర్గారావు, పి.సింహాచలం, స్టాఫ్ నర్స్ మాధురికి బాధిత కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



# ప్రజా గ్రీవెన్స్‌కు విన్నపాల వెల్లువ

**- ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు**

**- మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ అర్జీలు**

**- పింఛన్లు, ఇళ్ల కోసం దరఖాస్తులు అందజేత**

**- ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే శంకర్**



**శ్రీకాకుళం, జనవరి 7(వార్త):** శ్రీకాకుళంలో ఎమ్మెల్యే గొండు శంకర్ నిర్వహిస్తున్న ప్రజా గ్రీవెన్స్ కు విన్నపాలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచే ప్రజలు తమ అర్జీలను అందజేసేందుకు పెద్ద ఎత్తున కార్యాలయం వద్దకు చేరుకున్నారు. గార, శ్రీకాకుళం రూరల్, నగర ప్రజల సమస్యలను తెలుసుకున్న శంకర్ సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో చర్చించి, పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపించారు. ముఖ్యంగా గ్రామాల్లో రోడ్లు, కాలువలు, డ్రైన్లు నిర్మాణం చేపట్టాలని ప్రజల నుంచి అధికంగా వినతులు వచ్చాయని తెలిపారు. వ్యక్తిగతంగా పింఛన్లు కావాలని, ఇళ్లు మంజూరు చేయాలని పలువురు దరఖాస్తులు అందజేశారు. గత వైసీపీ హయాంలో గ్రామాల్లో కనీస మౌళిక సదుపాయాలైన రోడ్డు, డ్రైన్లు, పారిశుధ్యం, విద్యుత్ వంటి పనులను కూడా చేపట్టకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో పల్లె పండుగ, గ్రామసభలు నిర్వహించి సమస్యలను గుర్తించి రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ చిన్నాభిన్నం అయ్యాయని, వాటిని తిరిగి పునరుద్ధరించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. నిరుపేదల ఆశలు నెరవేర్చే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా కాలువల్లో పూడికతీత పనులు, నగర పరిధిలో డ్రైన్లలో షిల్టు తొలగింపు చేపట్టినట్టు చెప్పారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం అమ్మిన 24 గంటల్లో నగదును వారి ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి సమస్యలను ఉన్నా తనను నేరుగా కార్యాలయంలో కలవచ్చని ఎమ్మెల్యే తెలిపారు.



## తేజేశ్వరరావుకు శివాజీ, శిరీష పరామర్శ

**మందస, జనవరి 7(వార్త):** హరిపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కనగల తేజేశ్వరరావు ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, ఎమ్మెల్యే గౌతు శిరీష మంగళవారం ఆయనను పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగింది, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది.. తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, దాసరి తాతారావు, భావన దుర్యోధన, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, బమ్మిడి కర్రయ్య, తమరియా భాస్కరరావు, బైరిశెట్టి గున్నయ్య, పుల్ల వాసు, సింగపురం వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ సీఆర్పీ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



**వంగర, జనవరి 7(వార్త):** ఏపీ సీఆర్‌పీ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎం.సీతారాంపురం హైస్కూల్‌లో ఎంఈవో వై.దుర్గారావు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రధానోపాధ్యాయులు బి.పద్మావతి, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లంక రామకృష్ణ, మండల అధ్యక్షుడు వై.రామకృష్ణ, యూటీఎఫ్ మండల ఉపాధ్యక్షుడు బలగ ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పెంకి గౌరీశ్వరరావు, ఏపీటీఎఫ్ స్టేట్ కౌన్సిల్ సభ్యులు పాలవలస శ్రీరాములనాయుడు, ఫెడరేషన్ నాయకులు మజ్జిగణపతిరావు, బి.సాంబశివరావు, రెడ్డి వాసు, సాకేటి శ్రీను, బి.అనురాధ, బి.ప్రేమ్‌కుమార్, కిరణ్‌కుమార్, తవిటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వేపై అవగాహన ర్యాలీ




**ఇచ్ఛాపురం, జనవరి 7(వార్త):** పాయితారీ కీర్తిపురం రెవెన్యూ గ్రామంలో మంగళవారం భూముల రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో లోపింటి పద్మనాభం, గిన్ని బాలరాజు, నరహరి తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్ర భారత్ ..మనందరి కర్తవ్యం

**శ్రీకాకుళం, జనవరి 7(వార్త):** స్వచ్ఛమైన భారతావని సాధనే మనందరి బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ పరిసరాలను.. పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ సామాజిక వేత్త ఇజ్జాడ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ 14 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో మెగా స్వచ్ఛభారత్ కార్యక్రమం ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యభారత్ ఆవిష్కరణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు సేవా నిరతిని, స్ఫూర్తిని ప్రశంసించారు. స్వచ్ఛ శ్రీకాకుళం సాధన కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని కోరారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని.. ఆనాడే ఆరోగ్య భారత్ ఆవిష్కరణ సాధ్యమవుతుందన్నారు. అంతకుముందు ఆర్ట్స్ కళాశాల మైదా నాన్ని పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ అధికారి డాక్టర్ యాల్ల పోలినాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ మాజీ గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు శాసపు జోగినాయుడు, వావిల పల్లి జగన్నాథనాయుడు, కొంక్యాన మురళి, గేదెల లక్ష్మి, పీజీ గుప్తా, సుగంధం సంజీ వరావు, గొర్లె వాసుదేవరావు, గోలీ ఉమామహేశ్వరరావు, మెట్ట ధనుంజయ, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.



## 10 నుంచి ఏపీఎల్ మ్యాచ్‌లు



**ఆమదాలవలస, జనవరి 7(వార్త):** ఎస్ఎంఎస్ యూత్, కృష్ణాపురం ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి ఆమదాలవలస ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్టు మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని విద్యాసాగర్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆమదాలవలసలోని జీజే కాలేజీ మైదానంలో సూపర్ 6 పద్ధతిలో మ్యాచ్‌లను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి సుమారు 50పైగా జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు సనపల మోహన్‌సురేష్, తమ్మినేని సంతు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు. సంక్రాంతి పర్వదినాల్లో యువత ఎంతో ఆనందంగా గడిపేందుకు ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల కోసం అంగరంగ వైభవంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.

# సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**-ఎమ్మెల్యే గౌతు శిరీష**



**మందస, జనవరి 7(వార్త):** సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందసలోని సాయిబుల కాలనీ నుంచి మహేంద్రతనయ-మెళియాపుట్టి రోడ్డు వరకు రూ.5.27 లక్షలతో నిర్మించిన రహదారిని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లెల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పిస్తామన్నారు. మంచి విజన్ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో పూర్తిస్థాయిలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, దాసరి తాతారావు, భావన దుర్యోధన, రట్టి లింగరాజు, మాజీ సర్పంచ్‌లు డుంకురు తిరుపతిరావు, డుంకురు త్రివేణి, లబ్బ రుద్రయ్య, రాజాన మహేష్, బమ్మిడి కర్రయ్య, దేవర శెట్టి మార్కండేయులు, తమరియా భాస్కరరావు, పంచాయతీ ఈవో బమ్మిడి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

## కిడ్నీ రక్కసికి మరొకరు బలి

**-సంఘ సంస్కర్త అప్పారావు మృతి**

**పలాస, జనవరి 7(వార్త):** ఉద్దానాన్ని పీడిస్తున్న మహమ్మారి కిడ్నీ వ్యాధికి మరొకరు బలి అయ్యారు. బొడ్డపాడు ఆదర్శ సంఘ వ్యవస్థాపకుడు గేదెల అప్పారావు ఈ వ్యాధితో మంగళవారం మృతి చెందారు. ఆయన ఎంతో మంది యువకులను కళారంగం, సమాజ సేవ వైపు మళ్లించారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తంచేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ దేవుణ్ణి ప్రార్థించారు. వీరిలో జైభీమ్ యువజన సంఘం అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, సంఘ సభ్యులు, బొడ్డపాడు గ్రామ ప్రజలు ఉన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



గేదెల అప్పారావు(ఫైల్)

# సంపూర్ణ ఆరోగ్యవంతులే సంపన్నులు

**-పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి**



**పలాస, జనవరి 7(వార్త):** సంపూర్ణ ఆరోగ్యవంతులే అధిక సంపన్నులని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి అన్నారు. మంగళవారం ఆ కళాశాలలో ఆహారంతో ఆరోగ్యం అనే వినూత్న కార్యక్రమాన్ని ఉమెన్ ఎంపవర్మెంట్ విభాగ అధ్యాపకులు ఎ.సునీత పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో సంపూర్ణ ఆరోగ్యవంతులే అధిక సంపన్నులన్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని, నిత్య జీవితంలో మంచి ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రూపులకు చెందిన విద్యార్థులు రకరకాల చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలతో చేసిన సలాడ్లు, జ్యూస్‌లు, పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. విభిన్న ఆహార పదార్థాల రుచి చూసి న్యాయ నిర్ణేతలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.

కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, ఐక్యూ ఏసీ విభాగ అధిపతి వెంకటరమణ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మధు, సైన్స్ విభాగాధిపతి శ్రీనివాస్ పట్నాయక్, ఉమెన్ ఎంపవర్మెంట్ విభాగ అధ్యాపకులు ఎ.సునీత, ఆర్.దీపకుమార్, కె.రోజారాణి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన కూన



**ఆమదాలవలస, జనవరి 7(వార్త):** ఆమదాలవలస-శ్రీకాకుళం ప్రధాన రహదారి విస్తరణ పనులను ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మంగళవారం పరిశీలించారు. కాంట్రాక్టర్, అధికారులకు పలు సూచనలు చేశారు. సంక్రాంతి కానుకగా ప్రజలకు ఈ రోడ్డు అందుబాటులోకి వచ్చేలా త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను మంజూరు చేయించామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఈ పనులను నిర్లక్ష్యంగా వదిలేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే ఈ రోడ్డుని పూర్తి చేస్తున్నామన్నారు.

## వార్డుల్లో గుంతలు లేని రోడ్లు



**ఇచ్ఛాపురం, జనవరి 7(వార్త):** గుంతలు లేని రోడ్ల కార్యక్రమంలో ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుంతలను పూడ్చుతున్నారు. చిన్న మేదర వీధి, 7, 8వ వార్డు పరిధిలో మంగళవారం పేట వీధిలో రోడ్ల మరమ్మత్తులు చేపట్టారు. వార్డు తెలుగుదేశం ఇన్‌చార్జి రంగాల శ్రీనివాస్ రెడ్డి పనులు పరిశీలించారు.

## ఉత్సాహంగా జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్



**శ్రీకాకుళం, జనవరి 7(వార్త):** స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సహకారంతో జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు మంగళవారం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ విచ్చేసి, క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. రన్నింగ్, జావెలిన్‌త్రో, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, షాట్‌పుట్ వంటి పోటీలు వివిధ విభాగాల వారీగా నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి 60 మంది పారా క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన 31 మంది క్రీడాకారులను ఈనెల 30న గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ కోచ్ శ్రీధర్, స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం అధ్యక్షుడు టి.రాము, ఎన్.గిరిధర్, కార్యదర్శి డి.అచ్యుతరావు, సభ్యులు ఎన్.స్రవంతి, ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్, ఎన్.రాజేష్, ట్రాఫిక్ జామ్ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ అరసవల్లి సెక్రటరీ మణిశర్మ, జేసీ సాయిబాబా, చింతు గణపతి, అల్లు రమ, మట్ట నీలం తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థి దశ నుంచే పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి



**వంగర, జనవరి 7(వార్త):** విద్యార్థి దశ నుంచే పిల్లలు పోటీతత్వం అలవర్చుకోవాలని వంగర ఎంఈవో-2 వై.దుర్గారావు సూచించారు. మనోజ్ శ్రావణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంఎస్ఆర్ పురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన నవోదయ మాక్ గ్రాండ్ టెస్ట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ టెస్ట్‌లో 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో దుర్గారావు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి పోటీ తత్వం అలవర్చుకొని లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం బౌరోతు భార్గవ్ రామ్(ఎంపీపీఎస్ లక్ష్మీపేట పాఠశాల), రెండో స్థానం లోహిత్, మూడో స్థానం డిసౌజ్, నాలుగో స్థానం రిత్విక్ సాయి, ఐదోస్థానం శ్రావ్య, ఆరో స్థానం రాజేష్ సాధించారు. బాలమోహన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెస్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మీసాల మనోజ్ కుమార్, మీసాల శ్రావణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు బొంతు పద్మావతి, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లంక రామకృష్ణ, వంగర మండల అధ్యక్షుడు వై.రామకృష్ణ, యూటీఎఫ్ వంగర మండల అధ్యక్షుడు బలగ ప్రసాదరావు, మండల ప్రధాన కార్యదర్శి పెంకి గౌరీశ్వరరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలవలస శ్రీరాములనాయుడు, సీఆర్ఎంటీలు, వంగర వివేక్ మాస్టర్ మైండ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# నేడు జడ్పీ బడ్జెట్ సమావేశం

**శ్రీకాకుళం, జనవరి 7(వార్త):** శ్రీకాకుళం జిల్లా ప్రజా పరిషత్ 2024-25 సంవత్సరం సవరణ బడ్జెట్, 2025-26 సంవత్సరం అంచనా బడ్జెట్‌ను ఆమోదించేందుకు జిల్లా ప్రజా పరిషత్ నూతన సమావేశ మందిరంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చ జరగనుందన్నారు. జిల్లా అభివృద్ధికి కేటాయించిన నిధుల వివరాలు ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. 1వ స్థాయీ సంఘ సమావేశాన్ని కూడా నిర్వహిస్తున్నామన్నారు.

# పారదర్శకంగా దేహ దారుఢ్య పరీక్షలు

■ 232 అభ్యర్థులు క్వాలిఫైడ్ ■ నేటి ఎంపికలు వాయిదా ■ 11న నిర్వహణ ■ ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి



**శ్రీకాకుళం, జనవరి 7(వార్త):** కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియలో భాగంగా మంగళవారం 600 మందికి 364 మంది హాజరు కాగా, 232 మంది అభ్యర్థులు అర్హత సాధించారని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి తెలిపారు. స్టైఫండరీ కేడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల దేహ దారుఢ్య, సామర్థ్య పరీక్షలు ఎచ్చెర్లలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో పకడ్బందీగా కొనసాగుతున్నాయి. ఈ పరీక్షలను మంగళవారం ఎస్పీ పర్యవేక్షించారు. ఆయన సమక్షంలో అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన, ఎత్తు, ఛాతీ కొలిచారు. అనంతరం 1600, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. ఎంపిక ప్రక్రియ పారదర్శకత, పూర్తిగా అభ్యర్థుల ప్రతిభ ఆధారంగానే జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. బుధవారం హాజరు అవ్వాల్సిన అభ్యర్థులు ఈ నెల 11న విధిగా హాజరు కావాలని ఆయన సూచించారు. ఈ ప్రక్రియలో డీఎస్పీలు వివేకానంద, అప్పారావు, మూర్తి, రాంబాబు, ప్రసాదరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# అంతర పాఠశాలల జోనల్ పోటీలు ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే



**రణస్థలం, జనవరి 7(వార్త):** రణస్థలంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలోని 77వ అంతర పాఠశాలల జోనల్ క్రీడా పోటీలను మంగళవారం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ అప్పలనాయుడు మాట్లాడుతూ ఆటలు ఆరోగ్యాన్ని మెరుగుపరచి, నాయకత్వ లక్షణాలు వికసించడానికి దోహదపడతాయన్నారు. పాఠశాలలలో పాఠాలతో పాటు ఆటలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పిల్లల శారీరక, మానసిక వికాసానికి ఆటలు ఎంతో అవసరమన్నారు. ఆటల ప్రోత్సాహం ద్వారా ఒక ఆరోగ్యకరమైన తరం నిర్మాణానికి మనమంతా కలిసి ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ..విద్యార్థులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ధర్నాను విజయవంతం చేయండి

**-సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు వంకల మాధవరావు**




**మెళియాపుట్టి, జనవరి 7(వార్త):** ఐటీడీఏ సాధనకు చేపడుతున్న ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మెళియాపుట్టిలోని ఆదివాసీ సంక్షేమ పరిషత్ కార్యాలయంలో ఐటీడీఏ సాధనకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన తర్వాత జిల్లాకు ఐటీడీఏ లేకుండా పోయిందన్నారు. జిల్లాలోని 16 మండలాల్లో ఆదివాసులున్నారని, వీరందరికీ భౌగోళికంగా, అందుబాటులో మెళియాపుట్టి సెంటర్ పాయింట్‌గా ఉంటుందన్నారు. పాతపట్నం, మందస, కొత్తూరు, హిర మండలం, మెళియాపుట్టితో సహా ఐదు సబ్ ప్లాన్ మండలాలున్నప్పటికీ మెజారిటీ మండలాలు మెళియాపుట్టికి అందుబాటులో ఉంటాయన్నారు. తక్షణమే ఇక్కడ ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో దీనబంధుపురం సర్పంచ్ ప్రతినిధి సవర వెంకటేష్, ముకుందపురం సర్పంచ్, ఏఐకేఎంఎస్ నాయకులు సవర భాస్కరరావు, శ్రీనుఅంపురం సర్పంచ్ జమ్మయ్య, మాజీ సర్పంచ్ సవర భైరాగి, వర్మ, గొట్టిపల్లి సర్పంచ్ గొల్ల జనార్దన్, సవర గణేష్, లక్ష్మణ్, యువకులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలకు మాజీ మంత్రి సీదిరి పరామర్శ



**మందస, జనవరి 7(వార్త):** మందస మండలంలోని భోగాపురం పంచాయతీ కె.జగన్నాథపురం గ్రామానికి చెందిన పిన్నింటి సూర్యనారాయణ ఇటీవల మరణించారు. దీంతో ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యనారాయణ మరణం తననేకు తీరని లోటని అన్నారు. ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. బెల్లుపటియా గ్రామానికి చెందిన అగ్గున్న అప్పన్న, బుడారి సింగి పంచాయతీ పాతకోటకు చెందిన సీనియర్ కార్యకర్త అభిరాం తండ్రి మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. ఏ కష్టం వచ్చినా తాను ఉన్నానని భరోసా ఇచ్చారు. బుడారిసింగి ఎంపీటీసీ సభ్యుడు సీర లోకనాథ్ ఇటీవల ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వీరగున్నమ్మపురం సర్పంచ్ కర్రి గోపాలకృష్ణ తండ్రి జగన్నాథం (చిన్నయ్య)కు ఓపెన్ హార్ట్ సర్జరీ కావడంతో ఆయా కుటుంబాలను అప్పలరాజు పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ డొక్కరి దానయ్య, వైసీపీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, జిల్లా కార్యదర్శి దల్లి జానకిరావురెడ్డి, శనాపతి కిషోర్‌కుమార్, సర్పంచ్లు గున్న రమణ, సురేష్‌కుమార్ పాణిగ్రాహి, భోగాపురం, పితాతొళి సర్పంచ్ ప్రతినిధులు ప్రసన్న చౌదరి, చింతాడ గణపతి, తమిరి శోభన్‌బాబు, అగ్గున్న దేవేంద్ర, పోలేటి భువన్ ఉన్నారు.



# ఎన్టీఆర్ క్యాలెండర్ ఆవిష్కరణ

**శ్రీకాకుళం, జనవరి 7(వార్త):** యంగ్ టైగర్ ఎన్టీఆర్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ఎన్టీ ఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు దుంగ శ్రీధర్, శ్రీకాకుళం పట్టణ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు బుర్రి మధు మాట్లాడుతూ యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటించిన ఆర్ఆర్ఆర్, దేవర సినిమాలు ప్రపంచ స్థాయిలో ఆయనకు మంచి పేరు, ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయన్నారు. త్వరలో విడుదల కానున్న వార్ 2, దేవర2, ప్రశాంత్ నీల్ సినిమాలు సూపర్ హిట్ అవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు, దుంగ భాస్కర్, గెంజి వాసు, గొండు శ్యామ్, సంతోష్ పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల వాడకంతో అనర్థాలు



**శ్రీకాకుళం, జనవరి 7(వార్త):** మాదకద్రవ్యాలు వాడకంతో అనర్థాలు కలుగుతాయని శ్రీకాకుళం రెండో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు అన్నారు. చెడు సంకల్పం కార్యక్రమం చేపల వీధిలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు అలవాట్లకు బానిస కాకూడదన్నారు. చెడు అలవాట్లవైపు దారి మళ్లితే భవిష్యత్తు అంధకారం అవుతుందని హెచ్చరించారు. విద్యార్థి దశ నుంచే వాటిపై అవగాహన కలగాలని ఉండాలని సూచించారు.

# అంధుల ఆశాజ్యోతి లూయిస్ బ్రెయిలీ




**ఎల్ఎన్ పేట, జనవరి 7(వార్త):** లక్ష్మీనర్సుపేటలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు, లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్మన్ డా.ఎంకే మిశ్రో ఆధ్వర్యంలో అంధుల ఆశాజ్యోతి లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బ్రెయిలీ జీవిత విశేషాలు, బ్రెయిలీ లిపి గురించి వివరించారు. తల్లిదండ్రులు లేని ఆచంటి రమణమ్మ అనే అంధురాలికి నగదు విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అశోక్ పాణిగ్రాహి, ఉపాధ్యాయులు టి.ఉపేంద్ర, విద్యార్థి, విద్యార్థినులు పాల్గొన్నారు.

# నిరాశ్రయులను పరామర్శించిన చింతాడ

**ఆమదాలవలస, జనవరి 7(వార్త):** కోర్టు ఉత్తర్వుల మేరకు ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలోని జొన్నవలస గ్రామంలో 23 ఇళ్లు పూర్తిగా తొలగించారు. దీంతో 23 నిరుపేద కుటుంబాలు నిరాశ్రయులై రోడ్డున పడ్డారు. దీంతో వైఎస్ఆర్సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ బాధిత కుటుంబాలను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. వారు ఉండటానికి తాత్కాలికంగా టెంట్లు వేయించి భోజనాలు ఏర్పాటు చేశారు. వీరి పరిస్థితిపై అధికారులతో మాట్లాడారు. వీరికి వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546